## వడలి రాధాకృష్ణ

'ఏమంటోంది?'

మాట్లాడలేదు వకుళ.

'చెప్పవోయ్! ఎంత ముద్దుల కూతురైనా మరీ ఇంత ఇదా!!'

'చెప్పడానికేముంది? రాత్రి శేషాద్రికి వచ్చింది. తరువాత అలా పడి ఉంది!'

పడకగదిలోకి తొంగి చూశాడు మూర్తి.

ఆరు బై ఆరు డబుల్‌కాట్ మంచం. డయాగనల్‌గా పడుకొని ఉంది పల్లవి. ఆమెలో అసహనం తాలూకు ఛాయలు స్పష్టంగా అగుపిస్తున్నాయి. ఉండుండి అటూ ఇటూ దొర్లుతోంది. పైన సీలింగ్ ఫ్యాన్ ఫుల్ స్పీడ్‌లో తిరుగుతున్నా బాగా చమటతో నిండి ఉంది. కూతురు ముఖంలోకి చూశాడు. వాలీవాలని రెప్పల అంచుల నుండి అగుపిస్తూన్న కనుగుడ్లు ఎర్రగా ఉన్నాయి.

'అయితే అమ్మాయిగారు నిద్రపోలేదన్న మాట!'

'తను పోలేదు... నన్ను పోనివ్వలేదు!' భర్తకు ఫిల్టర్ కాఫీ అందిస్తూ అంది వకుళ.

'మళ్ళీ ఏమయిందట?' మొదటి సిప్‌లో పెదాలు చురుక్కుమంటూంటే తమాయించుకొని, భార్య కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

'దానికి కొత్త ఏముంది?... అయినా ఖర్మ!' నుదిటిపై మెరుస్తున్న రెండు చెమట బిందువుల్ని చీరె చెరగుతో తుడుచుకుంటూ అంది వకుళ.

'ఖర్మా కాదు కాకరకాయా కాదు! దానికి ఉద్రేకం తప్ప ఏమీ తెలీదు!!'

'ఏమో! అయినా మొగుడు మీద అలిగి రావడం నెలలో మూడోసారి. చూసే వాళ్ళు ఏమనుకుంటారు?'

'అనుకోవడానికి ఏముందోయ్!.. వచ్చింది పుట్టింటికిగానీ పరాయిచోటుకు కాదుగా!' భార్యను కొంచెం కూల్ చేయాలనే ధోరణిలోనే కొంచెం తేలిగ్గా అన్నాడు.

'గుట్టుగా మొగుడు దగ్గరుండాల్సింది... బొత్తిగా...!'

భార్యలో ఒక ఆడమనసును చూస్తున్నాడు వరాహమూర్తి. కన్నతల్లిగా ఆమె వేదనను పరికిస్తున్నాడు. ప్రసాదు గుర్తుకు వచ్చాడు. చూస్తే అతను అలా అన్పించడం లేదు. కానీ పల్లవి ధోరణి...

వచ్చిన ప్రతిసారీ వారించి సర్ధిచెప్తూనే ఉంది వకుళ. కానీ ఎక్కడో తేడా... తన పెంపకంలోనా?... కాదనే చెబుతోంది వకుళ అంతరంగం.

సమస్య రానురాను జటిలమైపోతోంది. భర్తకు తెలిస్తే బాధపడతాడని చాలకాలం దాచిపెట్టింది. చిన్నపిల్లలే... అని సముదాయించింది. అయినా పల్లవి పరిస్థితిని పీకల మీదకు తెస్తోంది. ఏమీ పాలుపోని ఓ వింత సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడుతోంది వకుళ.

'పల్లూ! ఆఫీసు టైమ్ అవుతోంది... వస్తా రా...!! సాయంత్రం మాట్లాడుకుందాం' కూతురు ముఖంలోకి చూస్తూ అన్నాడు మూర్తి.

ఉలుకూలేదు పలుకూ లేదు ఆమెలో...

'పిచ్చిపిల్ల!' ఆయనపైకి అనలేదు. కానీ ఆయన మనసు అనుకుంటూనే ఉంది. ముం

# పెద్దగేటు చిన్నగేటు

దుకు కదిలాడు.

'ఓకే డాడీ!' దిండులో దాచుకున్న ముఖాన్ని బయటికి తీసి మరలా నిశ్చల అయిపోయింది పల్లవి.

'పిచ్చిమొద్దు!' ఈసారి పైకి అనేశాడు.


'అదికాదు. ఈయనో బడా మొద్దు!' గేటు ఆవల స్కూటర్ స్టార్ట్ చేస్తున్న భర్తను చూస్తూ అనుకొంది వకుళ.

ప్రసాద్ అటువంటి వాడని ఈనాటికీ అన్పించడం లేదు ఆవిడకి.

అందరు తల్లిదండ్రులు లాగా పల్లవిని కన్నారు. అల్లారు ముద్దుగా పెంచుకున్నారు.

మధ్యతరగతి ఆర్థిక స్థితి గతులకు అతీతంగా కూతుర్ని పెద్దచేసారు.

కూతురైనా, కొడుకైనా తనకు ఒక్కరు చాలనుకు



న్నాడు వరాహమూర్తి. వకుళ ఎదురు చెప్పలేదు. బాగా చదివించాడు. ఉన్నతంగా పెంచాడు.

తండ్రి ఆశల్ని నిరాశపరచలేదు పల్లవి. చదువుకొంది... మంచి మార్కులతో పాసయింది. కూతురు ఎదుగుదల... పెరుగుదల మూర్తికి మంచి సంతృప్తిని మిగిల్చాయనే చెప్పాలి.

నాన్న కూచిగా మిగిలిపోయింది పల్లవి.

'సెలవుల్లో సబ్జెక్ట్స్ రివిజన్ చేసుకోనీయకుండా దాన్ని అలా తీసుకుపోతారేమిటండీ!' భర్తను ప్రశ్నించేది వకుళ.

'నాలుగు రోజుల క్యాంప్ భాగ్యానికి కూతురుకు వచ్చే మార్కులేమీ తరిగి పోవులేవోయ్!'

తండ్రితో అరకు వెళ్ళడానికి సూట్‌కేస్ సర్దుకుంటూన్న పల్లవికి పక్కున నవ్వు వచ్చింది.

'దటీజ్ డాడీ!'

'నీకంతే అమ్మాయ్! ప్రక్క యింటి పరిమళ చూడు. ఎంత శ్రద్ధగా చదువుకుంటుందో!'

'అయినా ప్రోగ్రెస్ రిపోర్ట్ మార్కులతో నింపేది నీ కూతురేలేవోయ్!' అనేవాడు మూర్తి. అతని మాట ఎప్పుడూ ఒద్దిగా మిగలలేదు. పల్లవి ఎప్పుడూ స్కూలు ఫస్టే!' అవన్నీ తల్చుకుంటే చిన్న నవ్వు వకుళలో. అయితే ఏం లాభం? వైభవంగా ఒక్కగానొక్క కూతురికి పెండ్లి చేశారు. ప్రసాదు మంచివాడే. కానీ పల్లవి తద్భిన్నంగా తయారయింది.

అల్లుడు చెడు తిరుగుళ్ళకి అలవాటు పడ్డాడట. అందులోనూ కాంప్‌లకి వెళ్ళే ఉద్యోగమాయే... వెళ్ళిన ప్రతిసారీ వారానికి గానీ ఇంటికి రాడట.

'మమ్మీ! అయన నన్ను పట్టించుకోవడం మానేశాడు. పెళ్ళాం అంటే శ్రద్ధ లేదు. ఎక్కడెక్కడో తిరిగి వస్తుంటాడు. తనకు అమ్మాయిల పిచ్చి ఎక్కువ అని నా ఉద్దేశ్యం. ఈమధ్య ముదిరినట్లుంది. అందరినీ హాయిగా నవ్వుతూ పలకరిస్తాడు. కావాలని ఫోన్‌లు చేసి మరీ మాట్లాడుతాడు. నా దగ్గరకొచ్చేసరికి అవేమీ కన్పించవు. మొక్కుబడిమాటలు... నిస్సారపు నిశి రాత్రులు.'

కూతురి వేదనను అర్థం చేసుకోలేని ఆడ మనసుకాదు తనది. అయినా సముదాయించడానికి ప్రయత్నిస్తూనే ఉంది. ఒకటి రెండు పర్యాయాలు చూసి విషయం ముదురుతోందని భర్త ముందుంచింది వకుళ. పెద్దగా నవ్వాడు మూర్తి. ఆ నవ్వులోని అంతరార్థం అర్థం కాలేదు వకుళకి.

'అంటే...'

'ప్రసాదు కూడా మగాడే' అందులోనూ ఉద్యోగం చేస్తున్న మగాడు!!'

'ఉద్యోగస్తులకు నైతిక సూత్రాలు వర్తించవనా?'

'దానికి కాదు... ముందు నీకు పిచ్చి పట్టినట్లుంది!'


ఈజీగా తీసుకోబోయాడు మూర్తి. కానీ భార్యమాటలు ఆలోచనలో పడేస్తున్నాయి.

ప్రసాద్‌ని... అతని ప్రవర్తనని లోతుగా పరిశీలిస్తున్నాడు.

తనకు తెలిసిన వారి ద్వారా ఎంక్వయిరీ చేయించాడు.

వాళ్ళిచ్చిన ఫీడ్ బేక్ "ప్రసాద్ అతి మంచి బాలుడు!' అని.

'అతి'లోని అంతరార్థం అర్థం కావడం లేదు. ఆ అతిని అపహాస్యం చేస్తోంది పల్లవి.




ఎవరు ఏమనుకుంటారో అనే ధ్యాస లేకుండా తను అనుకున్న విధంగా ముందుకు సాగిపోయే మనస్తత్వం ప్రసాద్‌ది. అందుకు భార్య కూడా మినహాయింపు కాకపోవడం దురదృష్టకరం.

"ఇప్పుడెలా?" మూర్తి, వకుళా ఇద్దరూ ఆలోచనలో పడ్డారు.

కూతురునోట ఆమాట విని నివ్వెరబోయింది వకుళ. నెత్తీనోరూ బాదుకుంది. భర్తకు చెబుదామనుకొంది. అంతలోనే చెప్పలేకపోయింది.

'అదికాదు పల్లూ...'

'నేను ఆ మగాడితో కాపురం చేసేది లేదంటే లేదు అంతే!'

'లేకపోతే ఏమిటి చేసేది?' దగ్గరకు తీసుకుంటూ అంది వకుళ. పల్లవి కళ్ళు పల్చని నీటిపొరతో నిండి ఉంది. దాని వెనుక ఉన్న రౌద్రంతో రెప్పలు బరువెక్కి ఉన్నాయి. ఆవేశంతో పెదాలు వణుకుతున్నాయి.

పళ్ళు తమంతట తాముగా కొరుకుడు పడుతున్నాయి.

'విడాకులకు అప్లయి చేస్తాను. నాకాళ్ళ మీద నేను నిలబడడానికి జాబ్‌కి ట్రై చేస్తా... అదీలేకపోతే ఇంత అన్నం పడెయ్యడానికి మీరున్నారు. కాదంటే నుయ్యి, గొయ్యికో ట్రై చేస్తా...!'

కూతురు నోరు ముయ్యబోయింది వకుళ. అసలు చెంప చెళ్ళుమనిపించేదే! కానీ తమాయించుకొంది.

అల్లుడు పట్ల ఓ విధమైన ఏహ్యభావం కలుగుతోంది. అమ్మాయి మనసు తెలిసి మసలుకోలేని మనిషి ఓ మనిషేనా?

'ఆడదాని అచ్చటాముచ్చటా చూడవలసిన బాధ్యత లేకుండా...'

'ఇదే చెప్పడం... ఆ ప్రసాద్ వంటి దుర్మార్గుడితో కాపురం ఇక నా వల్ల కాదు. రేపు

ఎవతెనో తెచ్చి ఇది నీ సవితి అంటే నా బ్రతుకు ఏమికాను'?

'వై... నాట్!' నాన్నమాట ఎత్తేసరికి ఆమె కళ్ళలో నీళ్ళు రెట్టింపయిన సంగతి గ్రహించక పోలేదు వకుళ.

కూతుర్ని ఎలా సముదాయించాలో అర్థం కావడం లేదు. రోజు రోజుకీ చాలా మొండిగా తయారవుతోంది. తాను విన్నవి, కల్పించినవీ అన్నీ ఏకరువు పెడుతోంది. తానేదైనా సలహా యిద్దామని ప్రయత్నిస్తూంటే విషయాన్ని ఇంకా ఇంకా సాగదీసి, తాను బీపీ పెంచుకొని, తనకు బీపీ పెంచుతోంది. ప్రతీ సందర్భంలోనూ మిన్న కుండిపోతోంది.

ఒకవిధంగా వకుళ కంటికి కునుకు కరు వయిందనే చెప్పొచ్చు.

'అల్లుడితో విషయం చర్చిస్తే... ఏమో, ఏమవుతుందో!

అతను దీన్ని సీరియస్‌గా తీసుకొని కూ తుర్ని బాధలు పెట్టడం మొదలు పెడితే!' వకు ళకు ఎటూ పాలు పోవడం లేదు.

వచ్చి నెల దాటుతున్నా పల్లవి పట్టువీడే సూచన కనిపించడం లేదు. ముందు ఏదోలే చిన్నపిల్ల అనుకున్నా వరాహమూర్తిని క్రమంగా కూతురు సమస్య కృంగదీస్తూనే ఉంది.

భార్య మనసు నొచ్చుకోకుండా మసలుకో మని అల్లుడికి హితబోధ చేయాలని ఉంది. కానీ అక్కడా ఇటువంటి సమస్య తలెత్తితే?

ఇక ఇద్దరూ విడిపోకతప్పదేమో!

○ ○ ○

'ఇంతకాలం ఈయనేదో గొప్ప నిర్వాకస్తు డనుకున్నాను. ఇటువంటి నిర్వాకస్తుడనుకోలే దు!' పల్లవిలో అదే తరహా ఆగ్రహం. కళ్ళు పత్తికాయలయ్యాయి. ఆ వెంట కన్నీటిపొర.

ఆ రెండూ మిళితమయ్యాయి. ఆవేశంతో ఆయాసాన్ని మేళవించి అంటున్న మాటలు వకుళను ఆలోచనలో పడేస్తున్నాయి.

'నాన్నకూచికి ఇలాంటివి చెప్పడం ఇష్టం లేక ఇన్నాళ్ళూ నాలోనే దాచుకున్నాను. కానీ తప్పిందికాదు!'

'మరి ఈ పైపై ప్రేమలు ఎందుకో!'

'ఏం చేసేది?... కాకపోతే ఇప్పటి నిర్ణయం అప్పుడు తీసుకోలేకపోయాను' తల్లి చెబుతున్న కఠినమైన నిజాలు కృంగదీస్తున్నాయి పల్లవిని.


ఇన్నాళ్ళూ లోకంలో తన తండ్రి వంటి మంచిమనిషి ఎవరూ ఉండరని మురిసిపో యింది.

ప్రేమను పంచింది. ఆయన్ని చూడకబోతే బెంగపెట్టుకొని తల్లడిల్లిపోయింది. ఆయన ఆల న కోసం అర్రులు చాచేది.

మంచి ఎడ్మిరేషన్‌తో మనసునిండా... కళ్ళ నిండా... తండ్రిని నింపుకొనేది. అందరూ తన ను నాన్న కూతురివి అంటే పొంగిపోయేది.

చిన్నతనాన ఎక్కడున్నా పరుగెత్తుకుంటూ వచ్చి మూర్తి గుండెల మీద వాలిపోతేనే గాని తృప్తి ఉండేది కాదు పల్లవికి. తాను తప్ప ఇంకె వ్వరూ అవసరం లేరనుకొని, ఒక పిల్లతోనే సరిపెట్టుకొన్న వరాహమూర్తి అంటే తనకు కోటివరాల మూటలా అన్పిస్తుంది.

పైనా క్రిందా ఇంట్లో ఆడుకోవడానికి ప్ర కంటూ ఎవరూలేకపోయినా నాన్న భుజాల మీద ఆడుకొనేది. తండ్రి వీపు మీద స్వారీ చేసేది.




కూతురంటే వేయివరాల మూట అనుకొనే ఆయన ప్రేమకోసం ఎప్పుడూ వెంపర్లాడుతూనే ఉండేది.

కానీ!... అటువంటి ఆయనది... లూజ్ క్యారెక్టర్!

తాను కలలో కూడా ఊహించని విషయం.

వకుళ చెప్పుకుపోతోంది. ఆనాటి సంగతుల్ని పూసగుచ్చినట్లు కూతురికి వివరించి చెప్తోంది. మూర్తి రాసలీలల్ని ఏకరువుపెడుతూ. భర్త తనను ఎంతగా వంచించింది... ఎవర్తెనో ఏకా ఏకీ ఇంటికి తీసుకొచ్చి నలుగురిలో ఎంతగా పరువుతీసిందీ చెబుతూంటే దుఃఖం తన్నుకొస్తోంది పల్లవికి.

'తన కన్నతండ్రి ఇంత గ్రంధసాంగుడా?... ఇన్నాళ్ళూ ఆయన్ని ఓ రోల్ మోడల్‌గా ఊహించుకొంది తను!'

పరాయి ఆడదాని పొందుకోసం అందరూ ఇలానే పడిచస్తారేమో! దానికి వాళ్ళూ వీళ్ళూ అనే బేధాలు లేకుండా ఉండవనుకుంటా!!

ఆడదానిగా ఈ దుర్నీతిని తానుగా ఎదుర్కోవాలేగానీ, కట్టుకున్న మొగుడికి దూరమై ఒంటరిగా బ్రతుకీడ్చడం అవివేకమనిపిస్తోంది పల్లవికి.

ఆ విషయంలో తన తల్లి నుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉంది. ఆయన నిర్లక్ష్యానికి గురిఅయినపుడు ఆమె ఎంత మనోవేదనను అనుభవించి ఉంటుందో...

కానీ తాను చదువుకొంది... సమాజంలో తిరగగల సత్తాను సంతరించుకొంది. ఆనాడు ఏమీలేక... ఆడదానికి అవకాశాలు మృగ్యమైన ఆ రోజుల్లో... అమ్మ నాన్న పెట్టే మానసిక హింసను భరిస్తూ...' ఆ క్షణాన వరాహమూర్తి మీద అమితమైన ద్వేషం... కోపం నెలకొన్నాయి పల్లవిలో...

ఆ క్రమంలో ఆయన ఎదుట నిలువలేక

భర్త యింటికి పయనమైంది.

○ ○ ○

ఆమె వెళ్ళి చాలా కాలమే అయింది. అల్లుడి ఇంట్లో కుదురుగానే ఉన్నట్లు సమాచారం. గతంలో పదిరోజులకోమారు పరుగెత్తు కొచ్చేది. క్రమంగా ఆ రకమైన రాకపోకలు ఆగిపోయాయి.

వకుళలో ఓ విధమైన సంతృప్తి... మరో విధమైన న్యూనతాభావన. మూర్తి అయితే కొంచెం కొంచెం తెరిపిన పడుతున్నాడు.

'పిచ్చిది వాస్తవం తెలుసుకొంది...' అనుకున్నాడు.

కానీ ఇదివరకటిలా పలకరింపులు ఆగిపోయాయి. ఫోన్‌లు రావడం లేదు. ఎప్పుడైనా చేసినా ఓ మోస్తరు పొడిపొడి మాటలు.

బుజ్జగింపులు లేవు... నవ్వుల పువ్వులు లేవు.

సంతోషం ఒక్కసారి హరించుపోయినట్లయింది.

తనపట్ల ఒక్కసారిగా కూతురు పెంచుకున్న ద్వేషానికి మూలం కానరావడం లేదు వరాహమూర్తికి. ఎన్నిసార్లు ప్రయత్నించినా విఫలమవుతూనే ఉన్నాడు.

వకుళకయితే ఓ విధమైన సందిగ్ధ స్థితి. అపరాధ భావనేదో ఆమెను వెంటాడుతూనే ఉంది. కూతురు గుట్టుగా మొగుడితో కలిసి ఉంటోందన్న ఊరట. పుట్టింటి మీద... అందునా దేముడు లాంటి కన్నతండ్రి మీద కసిని, వికారాన్నీ పెంచుకొని రాకపోకల్ని తగ్గించేయడం వేదనకు గురిచేస్తోంది.

అయినా ఆడదాని స్థానం మొగుడి దగ్గర. కాలాలు మారినా... సంస్కృతులు రూపాంతరాలు చెందుతున్నా మెట్టినించి సహవాసం అనివార్యం... జీవన ప్రవంతిలో అంతర్భాగమూనూ...

తనకు తెలుసు... తన భర్త శ్రీరామచంద్రుడు... ఇంకా చెప్పాలంటే ఆ అవతార పురుషునికే ఆదర్శంగా నిలుస్తాడు. తనను ఎంతగానో లాలించి ప్రేమించాడు. మూర్తి అంతటి మహోన్నత వ్యక్తిత్వం దొరికినందుకు జీవితాంతం పొంగిపోతూంటుంది వకుళ.

అటువంటి ఆయన మీద అవాకులు చెప్పింది. లేనిపోనివి కల్పించి పల్లవి మనసు విరిచేసింది. తప్పలేదు మరి! నాన్న అంటే ప్రాణాలిచ్చే పిల్లకి తను చేసిన పనివల్ల ఆయన గిట్టని మనిషి అయ్యాడు. ఆ పరిణామంతోనే ప్రసాద్‌కి దగ్గరవసాగింది.

ఒక పచ్చి తిరుగుబోతని, వావి వరసలు లేని కామాంధుడని... పల్లవికి తండ్రి మీద ఎన్నో కట్టుకథలు చెప్పింది. కేవలం ఆమె మనసు మార్చడానికి... కాపురం నిలబెట్టడానికి.

ఆ అభాండాలు జీవితాంతం తనను కృంగదీస్తూనే ఉంటాయి. కానీ అనివార్యమైన పరిస్థితి.

వెయ్యి అబద్ధాలు ఆడైనా ఓ పెళ్ళి చేయాలంటారు. పెళ్ళి కోసం ఏమోకాని కాపురం నిలబెట్టాలంటే ఒక అబద్ధం ఆడాలి తను ఈనాడు.

ఆ క్షణాన భర్త తనకో అపురూప వరంగా అన్పిస్తున్నాడు వకుళకి. పల్లవి మనసు మార్చుకుంటుందా?... తండ్రి పట్ల దృష్టి కోణం మారుతుందా?... ఏమో... ఈ గీత ముందు మరో పెద్ద గీత వచ్చి నిలబడాలిగా... ●